

జనవరి 24 నుంచి నాటికల పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

చంద్రమాంపల్లి-దివిలిలో 2024 జనవరి 24 నుంచి 26వ తేదీ వరకు నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్టు స్నేహ ఆర్ట్స్ నాటిక పరిషత్ అధ్యక్షుడు గొందేశి రాజా తెలిపారు. గురువారం చంద్రమాంపల్లిలో కేదారి నాగు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లుగా తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ నాటిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఏడాదీ సహాయ సహకారాలు అందించినట్టే ఈ ఏడాది కూడా నాటిక పరిషత్ నిర్వహణకు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇంధన బ్రహ్మానందం, మానేపల్లి రవీంద్ర, కేదారి నాగు, ఎం.సత్తిబాబు, డి.పాపేశ్వరరావు, వెన్నా పండు, గుండేసి సత్యానందం, కె.ప్రసాద్, పి.సత్తిబాబు, డి.కృష్ణ, జె.దొరబాబు, మాగాపు నాగు, జిఎస్ఆర్.స్వామి పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ పనుల్లో తీవ్ర జాప్యం

- అభివృద్ధికి నిధుల గండం
- రూ.180 కోట్ల వాటా ఇవ్వని రాష్ట్రం
- 7 నెలల్లో ప్రాజెక్టు గడువు ముగింపు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ స్మార్ట్ సిటీలో అభివృద్ధి అరకొరగానే జరుగుతోంది. నిధుల సమస్యతో పలు పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వచ్చే ఏడాది జూన్‌తో స్మార్ట్ సిటీ మిషన్ ముగుస్తుండగా ప్రతిపాదించిన పనులన్నీ పూర్తవుతాయో లేదోననే అనుమానాలు అందరిలోనూ వ్యక్తమవుతున్నాయి.

2016 జూన్‌లో దేశవ్యాప్తంగా వంద స్మార్ట్ సిటీలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. అందులో ఎపి నుంచి మూడు నగరాల్లో కాకినాడ ఒకటి. కేంద్ర ప్రభుత్వం దేశంలోని నగరాలను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దేందుకు స్మార్ట్ సిటీల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఏటా రూ.200 కోట్లు తగ్గకుండా నిధులు మంజూరవుతాయి. వీటిలో 50 శాతం కేంద్ర ప్రభుత్వ వాటా, రాష్ట్ర ప్రభుత్వం వాటా 20 శాతం. మిగిలిన 30 శాతం నగరపాలక సంస్థ భరించాల్సి ఉంటుంది. నగరపాలక సంస్థ 31.69 చ.కిమీ. (50 డివిజన్లు)గా విస్తరించి ఉంది. నగరంలో ప్రస్తుతం 4 లక్షల మందిపైనే జనాభా ఉంది. ప్రణాళికాబద్ధంగా నిర్మించిన నగరంగా, పింఛనుదారుల స్వర్గధామంగా ఇప్పటికే పేరుంది. సుమారు 101 మురికివాడలు ఉన్నాయి. 300 కిలోమీటర్ల మేర మురుగునీటి కాలువలు ఉన్నాయి. రోజువారీగా సుమారు 300 టన్నుల చెత్త వస్తుంది.


కాకినాడలో పనులు పూర్తి కాక ప్రారంభం కాని గోదావరి కళాక్షేత్రం

పెండింగ్‌లో 21 పనులు

స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా రూ.1,005 కోట్లు నిధులను ప్రతిపాదించారు. కాకినాడను అన్ని విధాలా అభివద్ధి చేసేందుకు విడతల వారీగా 77 ప్రాజెక్టులను ప్రతిపాదించారు. వీటిలో నిర్దేశించిన 50 ప్రాజెక్టులు ఎట్టకేలకు పూర్తి కాగా, 6 పనులను రద్దు చేశారు. సకాలంలో బిల్లులు అందని పరిస్థితుల్లో ఇంకా 21 పనులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా పలు పాఠశాలల అభివద్ధి, రోడ్లు, పార్కులు, స్కిల్ డెవలప్‌మెంట్, సెంటర్ లైటింగ్ సిస్టం, సోలార్ విద్యుత్తు, ఉచిత వైఫై, సిసి కెమేరాల ఏర్పాటు, డిజిటల్ వర్చువల్ క్లాస్ రూముల, మార్కెట్లు, డ్రైన్లు, నూతన బస్ సెల్టర్ల నిర్మాణం, క్రీడా స్థలాల అభివద్ధి, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు తదితర వాటితో పాటు స్మార్ట్ రోడ్ల పనులను కూడా నిర్వహించారు. ఇప్పటికే వివేకానంద, గాంధీ, జన్మభూమి పార్కుల ఆధునీకరణ చేపట్టారు. 38 ప్రాంతాల్లో జిమ్‌ల ఏర్పాటు, రామారావుపేటలో ఇండోర్ షటిల్ కోర్టు, సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, రోడ్ల అభివృద్ధిని స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టారు. మార్కెట్లలో అభివృద్ధి చేశారు. వాడపేట, పల్లిపేట తదితర మురికివాడలను కొంత వరకూ అభివృద్ధి చేశారు. స్మార్ట్ రహదారి వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ పనులు పలు చోట్ల దెబ్బతిన్నాయని అంటున్నారు. నిర్వహణ లేక మరమ్మతులకు గురైనట్టు చెబుతున్నారు. రూ.100 కోట్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసినా ఏడాది క్రితం మూలకు చేరింది. దీనిలో భాగంగా మెయిన్ సెంటర్లలో సిసి కెమెరాలను, సెన్సార్ ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సక్రమంగా పని చేయడం లేదు. గోదావరి కళాక్షేత్రం, సైన్స్ సెంటర్, కన్వర్టబుల్ స్టేడియం, స్కేటింగ్ రింగ్, వ్యాయామ పరికరాల ఏర్పాటు పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.


వివేకానంద పార్కు పక్కన నిర్మాణ దశలో ఉన్న స్కేటింగ్ ప్రాంగణం

పనుల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం

అభివద్ధి పనుల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా నిధులను ఏళ్ల తరబడి విడుదల చేయడం లేదు. సుమారు రూ.180 కోట్లు ఇవ్వాల్సి ఉంది. స్మార్ట్ సిటీగా ఎంపిక చేసి ఏడేళ్లు గడుస్తున్న అభివద్ధి పనులు అంతంతమాత్రంగానే సాగుతున్నట్టు చెబుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పలు పనులు పెండింగ్‌లో ఉన్నాయని విమర్శిస్తున్నారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు పెద్ద మొత్తంలో బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కొనసాగుతున్న పనులు ప్రస్తుతం నత్తనడకన సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్మార్ట్ సిటీ మిషన్ పూర్తి కావడానికి మరో 7 నెలలు మాత్రమే గడువు ఉండడంతో ప్రభుత్వం పెండింగ్ నిధులను విడుదల చేస్తుందా లేదా అనే అనుమానాలు అందరిలోనూ వ్యక్తమవుతున్నాయి. త్వరితగతిన వాటిని విడుదల చేసి పనులన్నీ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కరపత్రాన్ని అవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మహాధర్నా జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 27, 28 విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో రెండు రోజులపాటు నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పలువురు ప్రజాసంఘాల నాయకులు పిలుపు ఇచ్చారు. సిఐటియు కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ అధ్యక్షతన గురువారంకార్మిక, రైతు సంఘాల సన్నాహక సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, కౌలు రైతులకు రుణాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉపాధి హామీ కార్మికులకు కనీస వేతనం రూ.600 చొప్పున 200 రోజులకు పని దినాలను పెంచాలని, నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేసి, స్కీమ్ వర్కర్లందర్నీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పిఆర్‌సి అమలు చేయాలని కోరుతూ ఈ ధర్నా చేపట్టినట్టు తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యనారాయణ, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్లూరి వెంకటేశ్వర్లు, ఐఎన్‌టియుసి ఎపి, తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరి రాజు మాట్లాడారు. రైతాంగం పోరాట ఫలితంగా పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేస్తానని మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీ రెండేళ్లు గడుస్తున్నా అమలు చేయలేదన్నారు. కార్మికులను నయా బానిసలుగా మార్చేందుకు ఉన్న హక్కులను తొలగిస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఏర్పడిన కరువు ప్రాంతాల్లో రైతులను ఆదుకునేందుకు తక్షణం ప్రభుత్వరంగం ఆధ్వర్యంలో సంస్థను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలపై భారాలు మోపేందుకు తీసుకువస్తున్న విద్యుత్ సవరణ చట్టం ప్రకారం స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించాలని, మహాధరాపై 24, 25 తేదీల్లో ప్రచారజాతా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పప్పు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఓటరు జాబితాల సవరణ

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో ఓటరు జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రణాళిక, ప్రమాణాల ప్రకారం సజావుగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ డాక్టర కతికా శుక్లా తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియ ప్రగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా పాల్గొని కాకినాడ జిల్లాలో సంక్షిప్త సవరణ కింద చేపట్టిన చర్యలను సిఇఒకు వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకూ అందిన ఫారమ్-6,7,8 దరఖాస్తులన్నిటిపై పరిశీలన, పరిష్కారాలను త్వరితగతిన నిర్వహిస్తున్నామని ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీల నుంచి అందిన అభ్యంతరాల పైన పరిశీలన జరిపి వాస్తవమైన వాటిపై అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డిఆర్ఒ కె.శ్రీధరరెడ్డి, డిటిలు యం.జగన్నాథం, రామ్ కుమార్, సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

కట్టమూరులో సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

కట్టమూరు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయం వద్ద గురువారం 70వ సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ చల్లా చిన వీర్రాజు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ వి.కృష్ణకాంత్ సభ్యులతో సహకార ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంఘాల ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాలు, సహాయ సహకారాలను వివరించారు. సబ్ డివిజనల్ అధికారి జిఎన్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సంఘాలకు ఇస్తున్న ప్రోత్సాహం, భారతదేశ ఆర్థిక వ్యవస్థలో సహకార సంఘాల ప్రాధాన్యత అంశాలను వివరించారు. ఈ సదస్సులో సంఘ సిఇఒ పిఎస్‌విఎన్.ఆచార్యులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఎంఎల్‌ఎ సాయం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

నాగులపల్లి ఉప్పరగూడెంలో షార్ట్ సర్క్యూటివ్‌తో ఇల్లు కాలిపోయిన ఘటనలో బాధిత కుటుంబాలను పిఠాపురం ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు గురువారం పరామర్శించారు బాధిత కుటుంబాలకు తక్షణ సహాయంగా రూ.30,000 నగదు, బియ్యం అందించారు. బాధితులకు వెంటనే సర్టిఫికెట్లు వచ్చేలా చూడాలని అధికారం ఆదేశించారు ఐఎవై ద్వారా బాధితులందరికీ హౌసింగ్ లోన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు అనాల సుదర్శన్, సర్పంచులు ఉమ్మడి మేరీ జాన్, పాలని దొరబాబు, పులి జయ బాబు, జెడ్‌పిటిసి గుబ్బల తులసి కుమార్, సర్పంచ్ గుర్రాల చిరంజీవి కుమార్, కారే శ్రీనివాస్, దాకే రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ పొన్నాడకు ఘన సత్కారం

ప్రజాశక్తి - తాళ్ళరేవు

కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెంలో ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌ను గ్రామస్తులు గురువారం ఘనంగా సత్కరించారు. ఆయన వెండి కిరీటం అలంకరించి, పూల వాన కురిపించారు. అనంతరం ఎంఎల్‌ఎ సతీష్ మాట్లాడుతూ మత్స్య సంపద అంతరించకపోవడానికి ఒకే ఒక్క కారణం ఆయిల్ కంపెనీలన్నారు. అడవి మీద గిరిజనులకు ఎంత హక్కు ఉందో గంగమ్మ తల్లి మీద మత్స్యకారులకు అంతే హక్కు ఉంటుందన్నారు. మత్స్యకార వృత్తిలో పడుతున్న ఇబ్బందులను అసెంబ్లీలో తెలియజేశానని చెప్పారు. నష్టపరిహారంలో ఎస్‌సిలకు కూడా న్యాయం చేస్తున్నామన్నారు. గోగుల్లంక, బలుసుతిప్ప, పల్లం, గ్రామాల్లో మత్స్యకార వృత్తిపై ఆధారపడిన 600 మంది ఎస్‌సిలకు నష్టపరిహారం అందించనన్నామని ఎంఎల్‌ఎ తెలిపారు.

ఆదిత్యలో పత్రికాదినోత్సవం

కాకినాడ : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల తెలుగు శాఖ, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ పత్రికా దినోత్సవం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. సమాచారంతోపాటు జ్ఞానాన్ని అందిస్తూ ప్రజలను చైతన్య పరిచే శక్తివంతమైన సాధనం పత్రిక అన్నారు. ప్రజాస్వామ్యానికి పత్రికలు నాలుగో స్తంభమని, దేశంలోని పత్రికలు ఎలాంటి ఒత్తిళ్లకూ తావులేకుండా స్వేచ్ఛగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్న సందేశంతో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ పత్రికా దినోత్సవాన్ని నిర్వహిస్తుందని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, మూర్తి, తేజేశ్వరరావు, దివాకర రావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వన సమారాధన

తాళ్లరేవు : పి.మల్లవరం, వై.జంక్షన్ వద్ద నూతనంగా నిర్మించిన శివాలయం వద్ద ఆలయ నిర్మాణకర్త సలాది రామానాయుడు, రత్నకుమారి ఆధ్వర్యంలో గురువారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. ద్రాక్షారామంకు చెందిన ప్రసన్నాంజనేయ మ్యూజికల్ భజన సమాజం పాడిన సంకీర్తనలు ప్రజలను అలరించాయి. ఉంగరాల వెంకటేశ్వరరావు, ఉంగరాల బూరిబాబు, సలాది సత్య కృష్ణ, ధూళిపూడి సుభ, సుబ్బారావు, విళ్ల సత్యనారాయణ, దున్నా మురళి పాల్గొన్నారు.

అనువైన విత్తనాలు వేసుకోవాలి

యు.కొత్తపల్లి : రబీకి అనువైన విత్తనాలు వేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి వి.జోగిరాజు తెలిపారు. కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, వాకతిప్పలో రైతులకు గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో జోగిరాజు మాట్లాడారు. ఎంటియు 1,121 శ్రీధృతి 130 రోజులకు గాను అగ్గితెగులు, సుడిదోమ బారి నుంచి తట్టుకుని హెక్టార్‌కు 8 నుండి 10 టన్నుల వరకు దిగుబడి వస్తుందని తెలిపారు.

కనీస పెన్షన్ కోసం ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ



ధర్నా చేస్తున్న ఇపిఎఫ్ పెన్షనర్లు

కేంద్ర ప్రభుత్వం దేశంలోని ఇపిఎఫ్ పెన్షనర్లందరికీ కనీస పెన్షన్ రూ.9 వేలు డిఆర్‌తో కలిపి చెల్లించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సిహెచ్.సత్యనారాయణ రాజు డిమాండ్ చేశారు. గురువారం బోట్ క్లబ్ వద్ద ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కర్రి బాబూరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇపిఎఫ్ పెన్షనర్లు 75 లక్షల మంది ఉన్నారని అందులో 35 లక్షల మందికి కనీసం రూ.వెయ్యి కూడా చెల్లించడం లేదన్నారు. 2014లో బిజెపి కనీస పెన్షన్ రూ.3 వేలు చెల్లిస్తానన్న హామీని ఈ పదేళ్లలో అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎండిఎ.ఖాన్, యుఎస్ఎన్.రెడ్డి మాట్లాడారు. సిపిఎం రూరల్ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరభద్ర రావు, బర్నబాస్, సత్యనారాయణ, పి.రమణ, దుర్గాప్రసాద్, కెవి.సత్యనారాయణ, రామకృష్ణ, మేడిశెట్టి వెంకటరమణ, బొట్ట సత్యనారాయణ, బుద్దాల సత్యనారాయణ పాల్గొన్నారు.

'వైసిపి పాలన నుంచి విముక్తే లక్ష్యం'

ప్రజాశక్తి-కాకినాడ

వైసిపి ప్రభుత్వ అరాచక, విధ్వంసక పాలన నుంచి ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగించడమే తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీల లక్ష్యమని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు, జనసేన సిటీ ఇన్‌ఛార్జి ముత్తా శశిధర్ స్పష్టం చేశారు. టిడిపి, జనసేన ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. రెండు పార్టీల ఉమ్మడి ఎజెండా, పార్టీ కార్యక్రమాలు, ఓటర్ వెరిఫికేషన్ తదితర అంశాలపై చర్చించారు. జనసేన సిటీ ఇన్‌ఛార్జి ముత్తా శశిధర్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల నుండి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగించడమే లక్ష్యంగా ఎన్నికలకు వెళతామన్నారు. ఈ కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు, తోట సుధీర్, మల్లిపూడి వీరు, తలాటం సత్య, గ్రంధి నారాయణరావు, అడబాల సత్యనారాయణ, నసింహదేవర విశ్వనాథం, మడ్డు విజయ్ కుమార్, కడలి ఈశ్వరి, పి.రవి, తాజుద్దీన్, ఆన్సర్, తుమ్మల రమేష్, అంబటి చిన్న పాల్గొన్నారు.

దాళ్వాకు సాగునీటి ఎద్దడి?

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేరు ఆయకట్టు కింద దాళ్వా సాగుకు నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి అన్నారు. భద్రవరం గ్రామంలో సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన వివిధ శాఖల అధికారుల సమావేశంలో ఎఒ మాట్లాడారు. ఏలేరు రిజర్వాయర్‌లో తగినంత నీటి నిల్వలు లేని కారణంగా ఆయికట్టు రైతులకు పూర్తిస్థాయిలో నీరు అందే అవకాశం లేదన్నారు. రైతులకు వ్యవసాయ నిమిత్తం మార్చి 31 వరకే నీటి విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి అన్నారు. వరి సాగు చేయాలనుకొనే రైతులు స్వల్ప కాలంలో 120 రోజుల్లో కోతకు వచ్చే రకాలను వెదజల్లే విధానం ద్వారా నవంబర్ 26 నుండి డిసెంబర్ 5లోగా వేసుకోవాలన్నారు. ప్రస్తుతం పంటలు పొట్ట ఈనిక దశలో ఉన్నందున ఇది సాధ్యం కాదన్నారు. ఏలేశ్వరం, సిరిపురం గ్రామాలలో 1200 ఎకరాల శివారు పొలాలకు సాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందన్నారు. వరి బదులు రైతులు అపరాలు సాగు చేసుకోవడం మేలని ఆమె సూచించారు. డిసెంబర్ 15లోగా కోతలు అయిన వెంటనే అపరాలు సాగు చేసుకోవడం వల్ల అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది అన్నారు.

బాలికల రక్షణ, విద్యాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆడపిల్లలను రక్షించి వారిని చదివించడం ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ జి.ఉష అన్నారు. 'బేటీ బచావో-బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా గురువారం కాండ్రకోట జెడ్‌పి హైస్కూల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాలు లేని సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలన్నారు. సమాజంలో సగం మంది ఉన్న మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే దేశం పురోభివద్ధి సాధిస్తుందన్నారు. ఈ సదస్సులో ఉపాధ్యాయులు ఎం.నాగశైలి, టిఎస్ఎన్.మూర్తి, బి.నూకరాజు, అంగన్‌వాడీ సూపర్వైజర్ ఉమాదేవి, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

గొల్లలగుంటలో వైసిపి ప్రచారం

జగ్గంపేట రూరల్ : గొల్లలగుంటలో గురువారం వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ జ్యోతుల చంటి బాబు నిర్వహించారు. తొలుత వైసిపి జెండాను ఆవిష్కరించారు. సచివాలయం వద్ద పథకాల బోర్డులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజపూడి సర్పంచ్ బుసాలా విష్ణుమూర్తి, జగ్గంపేట ఉప సర్పంచ్ బండారు రాజా, వైసీపి నాయకులు ఒమ్మి రఘురామ్, మండల అధ్యక్షులు ఒంటిపల్లి రామన్నదొర, ఇఒపిఆర్‌డి కొండలరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కాకినాడ : జెఎన్‌టియుకె, యుసిఇకెలో వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ సీనియారిటీ ప్రాతిపదికన రెగ్యులర్ చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో గురువారం విసి ప్రసాదరాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, మలక వెంకట రమణ మాట్లాడారు.

యుటిఎఫ్ కార్యవర్గానికి అభినందన

తాళ్లరేవు : యుటిఎఫ్ మండల నూతన కమిటీని ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ గురువారం అభినందించారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు సునీతను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి దొమ్మేటి సాగర్, జి.సత్యనారాయణ, ఎం.తాతారావు, కెఎన్‌బిఎస్‌వి. కుమార్, జె.నీరజ సిహెచ్.త్రిమూర్తులు, కె.ఈశ్వరరావు జి.రవికుమార్, ఎం.బాలకృష్ణ, ఎస్.మురళీకృష్ణ, డిఆర్.పార్వతి, పివిఎన్.అప్పారావు ఉన్నారు.


గొర్రెపూడిలో శాంతి సమావేశం

కరప : గొర్రెపూడిలో రూరల్ సిఐ కె.శ్రీనివాసు కరప ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజానీకం రాబోయే ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రజలందరూ పోలీసులకు సహకరించాలన్నారు.

న్యాయవాదిపై దాడికి నిరసన

ఏలేశ్వరం : ఇటీవల నంద్యాల బార్ అసోసియేషన్ సభ్యుడు మంద విజయ్ కుమార్‌పై జరిగిన అమానుష దాడిని ఖండిస్తూ ప్రత్తిపాడు న్యాయవాదులు గురువారం కోర్టును బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ కార్యదర్శి బొంగుళూరి మధుబాబు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు సర్వసాధారణంగా మారిపోయాయన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని, విజయ్ కుమార్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జె.రాజేష్, లింగంపల్లి శివకుమార్, సిహెచ్.రామకష్ణ, పిల్లి బలరాముడు, ఆర్ వెంకట్రావు, కె.శ్రీనివాసరావు, పి.నాగేంద్ర రాజు, ఆర్.అచ్యుత రామారావు, అశోక్ కుమార్, జోగేష్, కామేష్, మంజుష, ఆర్.వెంకటరెడ్డి ఉన్నారు.

కార్టూ'నిజం'



అందుకే పండగ మామూళ్లు ఇస్తున్నామయ్యా..!! తప్పేముందీ..!!!

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

జిల్లాలోని పలుచోట్ల గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం


సామర్లకోటలో నిర్వహిరంచిన కార్యక్రమమంలో ఎంఇఒ, లైబ్రేరియన్

కాకినాడ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో రామకృష్ణారావుపేట గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు జి.లక్ష్మీ కుమారి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రిటైర్డ్ డిప్యూటీ లైబ్రేరియన్ సలాది సాయి సత్యనారాయణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రత్నకుమారి, గ్రంథాలయాధికారి కె.రమేష్ బాబు, ఎస్.ప్రసాద్, జి.సుబ్బారావు పాల్గొన్నారు. **పెద్దాపురం** తహశీల్దారు వజ్రపు జితేంద్ర, సాహితీ స్రవంతి కార్యదర్శి కొత్త శివ అధ్యక్షతన నిర్వహించిన సభలో మాట్లాడారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య, గ్రంథాలయాధికారి బందిల రత్నమణి అధ్యక్షతన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు టివి.సత్యనారాయణ, హెచ్‌ఎం సిహెచ్‌వివి.ప్రసాద్ పాల్గొన్నారు. **పిఠాపురం** బిఎంఆర్ జూనియర్ కళాశాల జువాలజీ అధ్యాపకురాలు ఎ.సునీతాదేవి, మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం లావణ్య రేఖ, రాజీవ్ గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఎన్.దేవి పాల్గొన్నారు. **కరప** శాఖా గ్రంథాలయంలో అధికారి పివి.రంగయ్య మాట్లాడారు. హైస్కూల్ హెచ్‌ఎం లీలా మనోహర్, కొండేపూడి రాంబాబు, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యాపారి మృతి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట పట్టణం గాంధీనగర్ ప్రాంతానికి చెందిన కొబ్బరికాయల వ్యాపారి నరాలశెట్టి చక్రధర్ (52) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీ మాండవ్య నారాయణస్వామి ఆలయ సమీపంలో నరాలశెట్టి చక్రధర్ కొబ్బరి కాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భార్య అనారోగ్యం కారణంగా మనస్తాపానికి గురయ్యారు. రెండు రోజులు క్రితం పురుగుల మందు తాగారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతన్ని స్థానికులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం తెల్లవారు జామున మృతి చెందారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారిలో మామిళ్లదొడ్డి వంతెన సమీపంలో ప్రయాణికులతో కాకినాడ వెళుతున్న ఆటోను కాకినాడ నుంచి పెద్దాపురం వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును హైడ్రా సాయంతో పోలీసు స్టేషన్‌కు తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.

నలుగురిపై సారా కేసులు నమోదు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని వివిధ గ్రామాల్లో అధికారులు దాడులు నిర్వహించి సారాను విక్రయిస్తున్న నలుగురిపై కేసులు నమోదు చేశారు. 1,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి, 40 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ పి.అశోక్ మాట్లాడారు. గెద్దనాపల్లిలో 600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం రామకృష్ణాపురం గ్రామంలో 20 లీటర్ల నాటు సారా, గోకవరంలో 600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసులు నమోదు చేశామన్నారు.

దొమ్మేరులో ఉద్రిక్తత

- హోం మంత్రి వనితకు చుక్కెదురు
- దళిత యువకుడు మహేంద్ర అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి- కొవ్వూరు, రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలీస్ విచారణతో ఆత్మహత్య చేసుకున్న బొంత మహేంద్ర(21) అంత్యక్రియలు గురువారం పూర్తయ్యాయి. మహేంద్ర మృతికి అధికార పార్టీలో వర్గ విబేధాలే కారణమని రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. స్థానిక ఎంఎల్ఎ, హోం మంత్రి తానేటి వనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునలను పరామర్శకు పంపించింది. ఈ నేపథ్యంలో దొమ్మేరులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చిన హోం మంత్రి తానేటి వనితను స్థానికులు కారు దిగనివ్వలేదు. పోలీసుల సహకారంతో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ప్రభుత్వ సలహాదారు రాజీవ్ కృష్ణ మాత్రమే కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రుల రాక నేపథ్యంలో గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ స్థానికులు తీవ్ర స్థాయిలో ప్రతిఘటించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. ఒక దశలో పోలీసులు, గ్రామస్తుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో పోలీసులు ఆందోళన కారులను చెదరగొట్టి మహేంద్ర ఇంటి వద్దకు అతికష్టం మీద తీసుకెళ్లారు. పరామర్శించిన అనంతరం ప్రభుత్వ సలహాదారు రాజీవ్ కృష్ణ రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రి మేరుగ నాగార్జున రూ.10 లక్షలు చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. హోం మంత్రి తానేటి వనిత విజయం కోసం మహేంద్ర పనిచేశారని, పోలీసులు నిర్బంధించడంతో కనీసం పట్టించుకోలేదని, ఆమె దృష్టికి తీసుకెళ్లినా ఒక్క ఫోన్ కూడా చేయలేదని కుటుంబ సభ్యులు మంత్రుల ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సారి ఎన్నికల్లో తానేటి వనిత ఎలా గెలుస్తారో చూస్తామంటూ హెచ్చరించారు. తన చావుకు కారణం కొవ్వూరు స్టేషన్ ఎస్ఐ భూషణం, వైసిపి నాయకులు నాగరాజు, సతీష్ కారణమంటూ మృతుని వాయిస్ రికార్డు దొరికినట్టు వార్తలు విన్పించాయి.

సిపిఎం నాయకుడు జువ్వల రాంబాబు గృహ నిర్బంధం

దొమ్మేరు ఘటనల నేపథ్యంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పోలీసుల వేధింపులు తాళలేక దొమ్మేరులో బొంత మహేంద్ర అనే దళిత యువకుడు మృతి చెందారు. ఈ నేపథ్యంలో మహేంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు గురువారం మంత్రులు దొమ్మేరు గ్రామానికి చేరుకున్నారు. మంత్రుల రాక నేపథ్యంలో జువ్వల రాంబాబును పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

గృహనిర్బంధం అక్రమం : సిపిఎం

దొమ్మేరు ఘటన నేపథ్యంలో మంత్రులు వచ్చిన సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబును అక్రమంగా నిర్బంధించడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుల తీరును ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలన్నారు.


మృతుని తల్లికి చెక్కును అందిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున


గృహనిర్బంధంలో ఉన్న జువ్వల రాంబాబు

రసాబాసగా టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం

వేదికపైనే నాయకుల మధ్య తోపులాట

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం జడ్.రాగంపేట శివారున గురువారం పరిణయ ఫంక్షన్ హాల్‌లో టిడిపి, జనసేన పార్టీల మధ్య జరిగిన ఆత్మీయ సమావేశం రసాభాసగా మారింది. టిడిపి, జనసేన నాయకులు వేదికపైనే తోపులాటకు దిగడం చర్చనీయాంశమైంది. గోకవరం మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు ఉంగరాల మణిరత్నం, టిడిపి కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగి కాలు విరిగిందని, సమావేశానికి ముందు జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాటంశెట్టి సూర్యచంద్ర ఆధ్వర్యంలో జనసైనికులు ఫంక్షన్ హాలు గేటు వద్ద బైఠాయించారు. టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి జ్యోతుల నెహ్రూ వచ్చి సమాధానం చెప్పాలంటూ ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న జ్యోతుల నెహ్రూ పాటంశెట్టి వద్దకు వెళ్లి మాట్లాడారు. సమస్యలుంటే సమావేశం అనంతరం కూర్చుని సామరస్యంగా చర్చించుకుందామని తెలిపారు. లోపలికి రమ్మని ఆహ్వానించారు. నెహ్రూ ఎంత చెప్పినా వినక పోవడంతో ఆయన సమావేశానికి వెళ్లారు. జనసేన నాయకులు తుమ్మల బాబు సమావేశానికి వచ్చి సూర్యచంద్రకు, జనసైనికులకు సర్ది చెప్పి సమావేశానికి తీసుకెళ్లారు. వేదికపైకి వెళ్లాగానే సూర్యచంద్ర ఘర్షణ విషయాన్ని ప్రస్తావించారు. బాధితులకు క్షమాపణ చెప్పాలని నెహ్రూపై ఒత్తిడి తెచ్చారు. ఈ సమయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, సూర్యచంద్ర మధ్య తోపులాట జరిగింది.


వేదికపై టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తల తోపులాట

సూర్యచంద్రకు టిక్కెట్ ఇస్తే సహకరించేది లేదు : నెహ్రూ

ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ జగ్గంపేట ఎంఎల్ఎ టిక్కెట్ పాటంశెట్టి సూర్యచంద్రకి ఇస్తే తాను సహకరించబోనని స్పష్టం చేశారు. సాధారణ జనసేన కార్యకర్తకు ఇచ్చినా పని చేస్తానని తెలిపారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు కలయికతో ఆత్మీయ సమావేశం పెట్టుకున్నామని, కొంత మంది రాజకీయ కక్షలతో సమావేశాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నించారన్నారు. 45 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఏ సమావేశంలోనూ జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఘర్షణ అనంతరం యథావిధిగా సమావేశం శాంతియుతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తుమ్మల బాబు, వరుపుల తమ్మయ్యబాబు, సూరంపాలెం బాలు, టిడిపి నాయకులు వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, ఎస్ఎవిఎస్.అప్పలరాజు, కొర్పు లచ్చయ్యదొర, పోతుల మోహన్ రావు, కొర్పు సాయి తేజ, యర్రంశెట్టి బాబ్జి, కొత్త కొండ బాబు, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

60 మంది ట్రైనీలకు కిట్లు అందజేత

ప్రజాశక్తి - యానాం

నిరుద్యోగ యువతకి నేషనల్ అర్బన్ లైవ్ హుడ్ మిషన్ పథకం ద్వారా యానాం మున్సిపల్ కార్యాలయంలో కొరియర్ డెలివరీ ఎగ్జిక్యూటివ్ కోర్సులో శిక్షణ పొందిన 60 మందికి కిట్లను ఆర్ఎఒ మునిస్వామి గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆఫీస్ మేనేజర్ ఖండవల్లి రామకృష్ణ, ఎసిఒ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఝాన్సీలక్ష్మీబాయి జయంతి

ప్రజాశక్తి - యానాం

రాణి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని గురువారం సమాచార శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ బీచ్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి, మున్సిపల్ ఆఫీస్ మేనేజర్ ఖండవల్లి రామకృష్ణ, సిఐ షణ్ముగం, ఎస్ఐ నూకరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

స్థానిక జిక్రియా నగర్ హై స్కూల్ రోడ్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర యానాం శాఖను పరిపాలనాధికారి మునిస్వామి గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు మంచి సర్వీస్ ఇచ్చి ఖాతాదారుల నమ్మకాన్ని నిలబెట్టాలని కోరారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర విజయవాడ జోనల్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ 41వ శాఖ యానాంలో ప్రారంభించామని తెలిపారు. ప్రజలు తమ బ్యాంకును ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ వివిఎస్.రామ్‌మోహన్ పరిపాలనాధికారి మునిస్వామిని దుస్సాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, యానాం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ ఈలపోలు విష్ణువర్ధన్ రావు, యానాం వర్తక సంఘం ప్రతినిధులు మాజేటి సత్యభాస్కర్, నల్లా వెంకన్న, ఎన్ఆర్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లాడి శామ్యూల్, యానాం కాపు సంఘం ప్రెసిడెంట్ కాటంశెట్టి వెంకట రామ్మూర్తి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

సత్యలక్ష్మికి మెడికల్ సీట్ కేటాయించాలని ఉత్తర్వులు

ప్రజాశక్తి - యానాం

ఇడబ్ల్యుఎస్‌లో కోన జయసత్యలక్ష్మికి మెడికల్ సీటు కేటాయించాలని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె మెడికల్ సీటు పొందాల్సి ఉండగా ఆ సీటును మేనేజ్‌మెంట్ కోటాలో మరొకరికి కేటాయించారు. ఈ నేపథ్యంలో విద్యార్థి తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేసి జయ సత్యలక్ష్మికి కచ్చితంగా 10 శాతం ఇడబ్ల్యుఎస్ కోటాను అమలు చేసి సీటు కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

అంబాజీపేటలో కార్డియాలజీ సేవలు

ప్రజాశక్తి-అంబాజీపేట

అంబాజీపేట వాసవి కాంప్లెక్స్ ఎదురుగా ఉషా క్లినిక్, డయాబెటిక్, జనరల్ వైద్య నిపుణులు, కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ ప్రతినెలా మొదటి గురువారం, మూడవ గురువారం అందుబాటులో ఉంటారన్నారు. గుండె వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డుకిరువైపులా వాహనాల నిలిపివేత


ప్రజాశక్తి-మండపేట

నిత్యం రద్దీగా ఉండే మండపేట నుంచి ఏడిద మీదుగా రాజమహేంద్రవరం వెళ్లే రహదారిలో రోడ్డుకిరువైపులా లారీలను నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు తరచూ అంతరాయం కలుగుతుంది. ఈ రోడ్డు మార్గంలో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం తదితర సరుకులను ఇతర ప్రాంతాల నుంచి భారీ వాహనాల్లో తీసుకొస్తుంటారు. మిల్లుల్లో సరుకు దిగుమతి చేసే వరకు వాహనాలను రోడ్డు చెంతనే నిలిపివేస్తున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు మార్గం ఇరుకుగా మారడంతో పాటు రోడ్డు అంతా గోతులు మయంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

చొప్పెల్ల ఆసుపత్రిలో తనిఖీలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్ల పశువైద్యశాలను పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.అనిత గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్యుల పనితీరుపై రైతులను అడిగి ఆరా తీశారు. సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆమె మాట్లాడుతూ సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆమె వెంట వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు కె.భానుప్రసాద్, తిరుమలరాజు ఉన్నారు.


టిడిపి, జనసేన నాయకుల సంఘీభావం

రాష్ట్ర క్షేమం కోసమే కలయిక

ప్రజాశక్తి-కొత్తపేట

జగన్ రాక్షస పాలన అంతమొందించి రాష్ట్ర ప్రజల క్షేమం కోసమే టిడిపి, జనసేన పార్టీలు ఏకమయ్యాయని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక బండారు బులిస్వామి చంద్రావతి కాపు కళ్యాణమండపంలో టిడిపి, జనసేనపార్టీ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ జగన్ పాలనలో ప్రజలు చాలా నష్టపోయారని, వారి ఆదుకోవడం కోసం, వైసిపి నాయకుల అక్రమాలు, అవినీతిని అడ్డుకునేందుకు టిడిపి, జనసేన పార్టీలు కలిసి పోరాటం చేయాలన్నారు. జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటిస్తూ ఎలాంటి పొరపాట్లు రాకుండా ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలోవానిరెడ్డి రాంబాబు, ఆకుల రామకృష్ణ, కోడికొట్టి చంద్రశేఖర్, తాళ్ల డేవిడ్ లలో పాటు తెలుగుదేశం, జనసేన పార్టీల సమన్వయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

జనగణనతో పాటూ కులగణన

మంత్రి వేణు గోపాలకృష్ణ

ప్రజాశక్తి - అమలాపురం

జన గణన మాదిరిగానే కుల గణన కూడా పదేళ్లకోసారి జరగాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్ కులగణనకు శ్రీకారం చుట్టారని బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,600 పైచిలుకు వరకు కులాలు, ఉప కులాలు ఉన్నాయన్నారు. కులాల ఆకాంక్ష మేరకు వారికి ప్రాతినిధ్యం ఎలా ఉన్నది అనేది తెలుసుకునేందుకు కులగణనను చేపట్టనున్నారు. 1951 నుంచి జనగణన మాత్రమే జరుగుతుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలు తప్ప మిగిలిన కులాల గణన జరగలేదని ఉద్యమాలు జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా కుల గణన ప్రస్తావన వచ్చిందన్నారు. ఈ గణన కోసం బిసి, ఎస్‌సి, మైనారిటీ, ఎస్‌టి ముఖ్య కార్యదర్శులతో కమిటీని నియమించారన్నారు. ఇటీవల పైలెట్ ప్రాజెక్టు మూడు గ్రామ వార్డులు రెండు వార్డు సచివాలయాల్లో నిర్వహించి ప్రక్రియను నిశితంగా పరిశీలించారన్నారు. ఈ సర్వే ఆధారంగా ఆయా కులాల అభ్యున్నతికి జనాభా ప్రాతిపదికన సంప నాయకుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియకు సంబంధించి ఐదు చోట్ల ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుల్లో అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. జిల్లా స్థాయిలో జెసి కుల గణన సర్వేకు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వారం రోజుల్లో వాలంటీర్ యాప్ లో 20 అంశాల ప్రశ్నావళిని ఆన్‌లైన్‌లో నింపి అందిస్తామన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

నేను లోకల్... నాకు ఓటెయ్యండి

రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాద్

ప్రజాశక్తి-రాజోలు

స్థానికుడు అయిన తను ఓటు వేస్తే నిత్యం ప్రజల్లో తిరుగుతూ నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తానని, వలస నాయకులను గెలిపిస్తే గెలిచిన తర్వాత కంటికి కనపడరని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజోలు ఎల్‌ఐసి రోడ్డును గురువారం ఆయన ప్రారంభించారు. వారాహి యాత్రలో భాగంగా రాజోలు గుండా ప్రయాణించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈ రోడ్డు దుస్థితిని చూసి 15 రోజుల్లో రోడ్డు వేయక పోతే తానే స్వయంగా వచ్చి శ్రమదానం చేసి రోడ్డు నిర్మిస్తానని సవాల్ విసిరారు. అయినా రోడ్డు నిర్మాణంలో జాప్యం జరగడంతో పలు మార్లు జనసేన నాయకులు రోడ్డు మరమ్మతులు చేసేందుకు ముందుకు వచ్చారు. ఎట్టకేలకు ఎంఎల్ఎ రాపాక చొరవతో రూ.90 లక్షల నిధులతో కనకదుర్గ గుడి నుంచి రాజోలు సెంటర్ వరకు సిసి రోడ్డు, డ్రెయినేజీని నిర్మించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేవు జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎంఎల్ఎ రాపాక మాట్లాడారు. టిడిపి, జనసేన, బిజెపినాయకులు ఎల్‌ఐసి రోడ్డులో చీపుర్లు పట్టుకుని ఫోటోలకు ఫోజులు ఇచ్చారన్నారు. తాను ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేశానని తెలిపారు. అలాగే రూ.80 లక్షలతో పాత ఎపిడి గారి ఆసుపత్రి రోడ్డుకు శంకుస్థాపన చేశామని తెలిపారు. పార్టీలకు, మతాలకు అతీతంగా తనను మరోమారు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు మట్టా శైలజ, మార్కెట్ కమిటీ చైర్మన్ గుబ్బల రోజా రమణి, ఎంపిటిసి సభ్యులు చెల్లింగి ఈశ్వరి, కె.పుష్పలత, స్థానిక నాయకులు దార్ల పెదబాబు, కెఎస్ఎన్.రాజు, కంచర్ల శేఖర్, మట్టా ఏడుకొండలు, అధికారులు పాల్గొన్నారు.

రత్నగిరి ఇఒ ఆజాద్ ఆకస్మిక బదిలీ

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం దేవస్థానం ఇఒ ఎస్.చంద్రశేఖర్ఆజాద్ ఆకస్మికంగా బదిలీ కావడంపై పలు వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ సంవత్సరం మార్చిలో ఆజాద్ దేవస్థానం ఇఒగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనతికాలంలోనే దేవస్థానంలో తన దైన శైలిలో అనేక చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా స్వామివారి వైదికపరంగా చేయాల్సిన కార్యక్రమాల పట్ల గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తులు గుర్తించే విధంగా నిర్వహించారు. సుమారు రూ.15 కోట్ల వ్యయంతో 67 అభివృద్ధి పనులు చేపట్టారు. ఉద్యోగులందరూ బాధ్యతగా మెలిగేలా క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. కీలక విభాగాల్లో దోపిడీకి అడ్డుకట్ట వేశారు. ఇది సహించని వారు ఆజాద్‌ను బదిలీ చేయాలని అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకులు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. ఆయన వచ్చిన ఆరు నెలలకే బదిలీ చేయించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆజాద్ ప్రస్తుతం శ్రీకాళహస్తి దేవస్థానానికి బదిలీ అయ్యారు

వంతెన నిర్మాణంలో తీవ్ర జాప్యం

ప్రజాశక్తి - గోకవరం

గోకవరం తానా సెంటర్ వద్ద సుమారు రూ.10 కోట్లతో నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన వంతెన నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని జడ్‌పిటిసి మాజీ సభ్యులు పాలూరి బోసుబాబు ఆరోపించారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. గోకవరం మీదుగా భద్రాచలం, పాడేరు, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ వంతెన ఎంతగానో అవసరం అన్నారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన పాత వంతెన ఇరుకుగా ఉండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాట్మెంట్‌కు సంబంధించిన అనేక అనుమానాలు, అభ్యంతరాలు ఉన్న నేపథ్యంలో సరైన ప్రణాళిక కాకుండా స్థానిక అఖిలపక్ష నాయకులను సైతం సంప్రదించకుండా హడావిడిగా వంతెన పనులు ప్రారంభిస్తున్నారని తెలిపారు. భూసేకరణ చేయకుండా వంతెన పనులు ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి నిర్మాణం వల్ల నష్టంపోయిన వారితో సంప్రదింపులు జరిపి వంతెన నిర్మాణానికి ఉన్న అభ్యంతరాలను పరిష్కరించి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.

పాలంగి ఉపసర్పంచ్ పదవి ఏకగ్రీవం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని పాలంగి గ్రామంలో 12వ వార్డు సభ్యుడు వెలివెల వెంకట సీతా రామారావు ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఇఒపిఆర్‌డి జిడివి.ప్రసాద్ గురువారం తెలిపారు. ఇంత వరకు ఉపసర్పంచ్‌గా ఉన్న మేళం రాజకుమారి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక నిర్వహించామన్నారు. 10వార్డు సభ్యుడు బసవ యేసు నాయుడు ప్రతిపాదించగా, 3వార్డు సభ్యుడు కడలి రవికుమార్ బల పరిచారు. దీనితో ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ రామారావుకు సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, పంచాయతీ కార్యదర్శి ఎమ్‌డి.హాసన్ జానీ, నాయకులు పాలాటి శరత్ బాబు, వార్డు సభ్యులు అభినందనలు తెలిపారు.

రగ్బీ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి -కరప

స్కూల్ గేమ్స్ ఆటల పోటీలో భాగంగా కర్నూలులో ఈనెల 17 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపికలు గురజానాపల్లి పబ్బినీడి పాపారావు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారని హెచ్‌ఎం మోహన్ తెలిపారు. అండర్ -14, 17 బాలురు బాలికలు విభాగాల్లో జట్లను ఎంపిక చేశారు. తొలుత సర్పంచ్ శ్రీనివాసరావు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. చదువుతో పాటూ ఆటల్లోనూ రాణించాలన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసి ఛైర్మన్ పబ్బినీడి వీరబాబు, ఎంపిటిసి సభ్యులు వై.వీరవేణి, కాకినాడ రూరల్ జోన్ అధ్యక్షుడు వి.మాచారావు, పిఠాపురం టౌన్ జోన్ అధ్యక్షుడు వి.హరిబాబు, తాళ్లరేవు జోన్ కోశాధికారి ఆర్. దుర్గా ప్రసాద్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 160 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

బాస్కెట్ బాల్ జట్టుకు ప్రగతి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ప్రగతి హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు మదనపల్లిలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-14 బాస్కెట్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రగతి విద్యార్థి సిహెచ్.కిరణ్‌రాజ్‌ను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారని ప్రగతి విద్యాసంస్థల డైరెక్టర్ నూతలపాటి హిమబిందు తెలిపారు. ప్రగతి విద్యాసంస్థల డైరెక్టర్ హిమబిందు, చైర్మన్ నూతలపాటి పూర్ణచంద్రరావు, ఎజిఎం ఎస్.అనిల్‌బాబు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిహెచ్‌ఆర్.సత్యనారాయణ విదార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.సురేష్, పిఇటిలు జి.సూరిబాబు, సూర్యకుమారి, ఉపాధ్యాయ బృందం ఉన్నారు

'వైసిపితోనే సంక్షేమ పాలన'

ప్రజాశక్తి - సీతానగరం

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన వైసిపితోనే సాధ్యమని ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. గురువారం మునికూడలి, రాజంపేట గ్రామాల్లో గడప గడపకఊ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సచివాలయాలతో ప్రజల ముంగిటకే పాలన వచ్చిందన్నారు. ప్రజా సాధికారతే లక్ష్యంగా సిఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, వైసిపి మండల కన్వీనర్ గంటా శ్రీను, కో-కన్వీనర్ కరటూరి హరిబాబు, సేవా దళ్ అధ్యక్షులు డాక్టర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.